విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

ప్రతి రైతుని ఆదుకుంటాం: ఎంపీ బాలశౌరి

విశాలాంధ్ర బ్యూరో, కృష్ణాజిల్లా : మిచౌంగ్ తుపాన్ మిగిల్చిన నష్టంపై పార్లమెంట్ లో ప్రస్తావించి రైతులకు న్యాయం చేస్తానని ఎంపీ బాలశౌరి అన్నారు. గురువారం ఎమ్మెల్యే పార్థసారథితో కలిసి పంటపొలాలను పరిశీలించారు. అక్కడే ఉన్న అధికారుల తో మాట్లాడి ఎంతమేరకు పంట నష్టం జరిగిందని ఆరా తీశారు. నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూడాలని ఎంపీ అధికారులకు ఆదేశించారు. అనంతరం ఎంపీ బాధిత రైతులతో మాట్లాడి ప్రభుత్వం నుంచి పరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. జగన్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. తుపాను మిగిల్చిన నష్టాన్ని, రైతులు పడుతున్న ఇబ్బందులు గురించి పార్లమెంటులో ప్రస్తావించి కేంద్రం నుంచి కూడా రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు చేపడతానన్నారు. ఈ కార్యక్రమంలో టిడ్కో డైరెక్టర్ చిన్నారి, మద్దూరు సర్పంచ్ చిప్పల రామదాసు, ఎంపీటీసీ శ్రీనివాసరావు, కాసరనేనివారి పాలెం సర్పంచ్ పెద్ది ప్రసాద్, వణుకూరు ఉప సర్పంచి గద్దల రాజా, రైతు నాయకులు నాగ రవి, గోపి నరసింహారావు, కంకిపాడు వైసీపీ పార్టీ మండల అధ్యక్షులు మద్దాలి రామచంద్రరావు, జడ్పీటీసీ బాబు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్కేటింగ్ హాకి పోటీలకు విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర-గుడివాడ : విశాఖపట్నంలో ఇటీవల జరిగిన జాతీయస్థాయి క్యాంప్ పోటీల్లో గుడివాడ డా॥ కె.కె.ఆర్ గౌతమ్ విద్యార్థులు జాతీయస్థాయి రోలర్ హాకీ(క్యాడెట్‌టీమ్) బాలుర విభాగంలో జి.శ్రీమంత్, ఎస్,ఎన్ అభిలాష్, ఎస్.ఎల్ సాత్విక్,లు, సబ్ జూనియర్ బాలికల విభాగంలో ఇ.నిఖీల, ఎం. ఖ్యాతిఅభిజ్ఞలు ఎపి జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్స్ సత్యారామ్, లక్ష్మీప్రసాద్, జ్యోతి, జబ్రీనాలు తెలిపారు. గురువారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో మాట్లాడతూ డిశంబర్ 10 నుండి 22 వరకు ఛండీఘర్‌లో జరిగే 61వ జాతీయస్థాయి స్కేటింగ్ ఛాంపియన్ షిప్‌లో శ్రీమంత్, అభిలాష్, సాత్విక్‌లు, రాష్ట్రస్థాయిలో ఇ.నిఖీల, ఎం.ఖ్యాతి అభిజ్ఞలు పాల్గొనడం జరుగుతుందన్నారు. కోచ్ పి.ఎస్.వి.ఎస్ అయ్యప్పను, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, పాల్గొన్నారు.

పొలాల్లో నీటిని తొలగించండి

విశాలాంధ్ర-మచిలీపట్నం : మిచౌంగ్ తుఫాను వలన పంట పొలాల్లోకి చేరిన వరద నీటిని వెంటనే తొలగించేందుకు తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డి ఆర్ ఓ పెద్ది రోజా, జిల్లా అధికారులు క్షేత్రాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి తుఫాను సహాయక చర్యలు, ధాన్యం సేకరణ, ఓటర్ల జాబితా సవరణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిచౌంగ్ తుఫానును రాత్రింబవళ్ళు కష్టపడి సమర్ధవంతంగా ఎదుర్కొన్నందులకు అందరినీ అభినందించారు. తుఫానుతో వరి పంటలు వరద నీటిలో మునిగాయన్నారు. పొలాల్లో డ్రైనేజ్ నీరు నిల్వ ఉండి రైతులకు నష్టం లేకుండా, నిల్వ ఉన్న నీటిని కాలువలలోకి మళ్ళించాలని సూచించారు. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ టెలికాంక్షన్స్ లో ఆర్డీవోలు, తహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తదితర అధికారులు పాల్గొన్నారు.

రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

జిల్లాలో మిచౌంగ్ తుపాను ప్రభావంతో కుదేలైన రైతులకు ప్రభుత్వం వెన్నంటి అండగా ఉంటుందని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఎండి జీ.వీరపాండియన్ తెలిపారు. గురువారం ఆయన కలెక్టరేట్లోని జిల్లా కలెక్టర్ వారి చాంబర్లో జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ లతో

కలిసి జిల్లాలో జరుగుతున్న ధాన్యం సేకరణపై సమీక్షించారు. అనంతరం ఆయన చాంబర్ నుంచి మాట్లాడుతూ జిల్లాలో తుపాను ముందు వరకు కూడా ధాన్యం సేకరణ ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగిందని, అదే స్ఫూర్తితో మిగిలిన ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేస్తామని రైతులకు చెప్పాలన్నారు. తుపాను కారణంగా నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకునే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారులకు నిత్యం ఆదేశాలు ఇస్తూనే ఉన్నారని, ఆ ప్రకారంగానే జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతు నుంచి ప్రతి గింజ కొనుగోలు చేసి ఆదుకుంటామని, ఎవరు కూడా అధైర్య పడొద్దని రైతులకు భరోసా కల్పించాలని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఎండి అధికారులకు సూచించారు.

క్షేత్రస్థాయిలో దృష్టి పెట్టండి

విశాలాంధ్ర-పెడన : తుఫాన్ సహాయక చర్యలపై క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఈ మేరకు పెడన మార్కెట్ యార్డ్‌లో వివిధ శాఖ అధికారులతో గురువారం మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజవర్గ పరిధిలో నాలుగు మండలాల్లో పంట నష్టపోయిన పరిస్థితులు పట్టణంలో కొన్ని ప్రాంతాలు జలమయం కావడం నేతన్నల మగ్గాలలో నీరు చేరడం వంటి పరిస్థితులు పంటలు నీట మునిగి రైతన్నలు అందరూ నష్టపోయారని ఆ పంట నష్టం అంచనా వేసే విషయంలో క్రింది స్థాయి అధికారులు సిబ్బంది ఎక్కడ కూడా అలసత్వం వహించరాదని నష్టపోయిన రైతన్నకు అండగా ఉండాలని నీట మునిగిపోయిన ప్రతి ప్రాంతాన్ని గుర్తించి ప్రతి ఒక్క రైతుకు కూడా న్యాయం జరిగేలా చూడాలని వ్యవసాయ మరియు రెవెన్యూ అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో బందరు ఆర్డీవో ఎం వాణి, డీఎస్ఓ పార్వతి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గరికపాటి చారుమతి నాయుడు, మున్సిపల్ చైర్ పర్సన్ కటకం నాగ కుమారి, ఎంపీపీ రాజులపాటి వాణి, వివిధ శాఖల అధికారులు, ఆయా మండలాల ఎంపీపీలు, జడ్పిటీసిలు, ఎంపీటీసీలు సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తుపాన్ బాధితులకు అండగా : మంత్రి జోగి

విశాలాంధ్ర-బంటుమిల్లి :- బంటుమిల్లి మండల కేంద్రాల్లో ఎంపీడీవో కార్యాలయాల్లో గురువారం తుఫాన్ కారణంగా ఏర్పాటుచేసిన సహాయ పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన బాధితులకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఆర్థిక సాయం పంపిణీ చేశారు. బంటుమిల్లి మండలంలో 59 కుటుంబాలకు రూ.1.33 లక్షల ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తుఫాను ప్రభావిత మండలాలు బంటుమిల్లి ప్రాంతాల్లో మిచౌంగ్ తుఫానుకు భారీ వర్షాలతో ఇళ్లలో నీళ్ల చేరి ఇబ్బందులు పడుతున్న పరిస్థితులలో ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులను సహాయ పునరావాస కేంద్రాలకు తీసుకువచ్చి మంచి భోజనం, తాగునీరు, వసతి కల్పించారన్నారు. బాధిత కుటుంబాలు తిరిగి ఇంటికి వెళ్లేటప్పుడు వారికి ఆర్థిక సాయం చేసి సంతోషంగా ఇంటికి పంపడం జగనన్న మంచి మనసుకు నిదర్శనమని అన్నారు. జగనన్నను నిండు మనసుతో ఆశీర్వదిం చాలని బాధితులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బంటుమిల్లి ఎంపిపి వెలివెల చినబాబు, జడ్పిటిసి మలిశెట్టి వెంకట రమణ, వైసిపి మండల పార్టీ కన్వీనర్ స్నానం మహేష్, మలిశెట్టి రాజాబాబు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమాని శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి ఒడిమె చిన్నరిబాబు, మల్లేశ్వరం మర్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు పాలడుగుల బాబురావు పాల్గొన్నారు.

బీసీ భవనం ఏర్పాటుకు కృషి చేయాలి

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ పట్టణంలో బిసి భవన్ం కోసం స్థలం కేటాయించాలని నియోజకవర్గం బిసి సంఘం అధ్యక్షులు దారం నరసింహారావు ఆధ్వర్యంలో ఆయన స్వగృహంలో గురువారం ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) కలసి విన్నతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావులకోల్లు మల్లేశ్వరావుతో దారం నరసింహారావు మాట్లాడుతూ గతంలోనే బిసి భవన్ నిమిత్తము 2,000 గజాలు స్థలం ప్రభుత్వం ద్వారా శాక్షాన్ చేయించామని ఎమ్మెల్యే నాని కోరటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు నైనవరపు శేషు, సబ్బాని రంగారావు, మహిళా ఉపాధ్యక్షురాలు తానా రాధ, బిసి ఉద్యోగుల సంఘం నాయకులు గుళిపల్లి ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు దొండపాటి వెంకటకృష్ణారావు, రూరల్ కన్వీనర్ బోయిన సోమశేఖర్, కలవగుంట శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం మొక్కలు రాకుండా చర్యలు

విశాలాంధ్ర-కూచిపూడి : వర్షాలకు కోతకోసిన తర్వాత నీళ్లలో ఉన్న ధాన్యం మొక్క మొలుస్తున్నాయని కాజ, పద్దారాయుడు తోటఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ దశలో అధికారుల సూచనలు మేరకు ద్రావణాన్ని ప్రేయర్ల ద్వారా చల్లుకొంటున్నామని రైతులు వెల్లడించారు. వర్షం నిలిచిపోయి 48 గంటలు దాటిన పొలాల్లోంచి గురువారం కూడా నీరు బయటకు పోవటంలేదనిఅయినంపూడి, ఉప్పాయికోడు డ్రైను పొంగిపోవడమే కారణమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పొలాలలో కేవలం 10 శాతం మాత్రమే యంత్రాలతో కోత కోయడం జరిగిందని, మిగిలిన పొలాల్లో అధిక శాతం సాంప్రదాయ పద్ధతిలో కూలీలతోనే వరి కోత కోయించామని పేర్కొంటున్నారు. ప్రస్తుతం చిన్న బోదులదగ్గర నుంచి నీటితో నిండిపోవడంతో నీరు పోయే మార్గం లేక గింజ మొలకవస్తోందని పేర్కొంటున్నారు. పల్లపు ప్రాంతం అవడంతో త్వరితగతిననీరు పోయే మార్గం లేదని ఈ దశలో తేమశాతాన్నిపరిగణలోనికి తీసుకోకుండా రంగు మారిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని పేర్కొంటున్నారు. ప్రాథమిక జాగ్రత్తలో భాగంగా రైతులు ముందస్తుగా అధికారుల సూచనల మేరకు ఉప ద్రావణాన్ని పిచికారి చేసుకుంటున్నామని రైతులు మంద శ్రీనివాసరెడ్డి, పేకేటి సీతారామరెడ్డి, పులివర్తి కోటినాగులు, శేఖర్ బాబు, ఏడుకొండలు, రామకృష్ణారెడ్డి, వివేకానంద రెడ్డి, మంద వెంకట్రామిరెడ్డి, ఏడుకొండలు తదితరులు వివరించారు.

మాకు ఓటు హక్కు కల్పించండి

విశాలాంధ్ర-కుత్తివెన్ను : తమకు ఓటు హక్కు లేదని, ఉండడానికి ఇల్లు లేదని తమకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎస్టీ మహిళలు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగు రమేష్ కు మొరపెట్టుకున్నారు. గురువారం మంత్రి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద తుఫాను బాధితులకు ప్రభుత్వం నుండి నగదు పరిహారాన్ని అందించారు. ఈ సమయంలో తుఫాను నష్టపరిహారాన్ని అందుకునేందుకు వచ్చిన ఎస్టీ మహిళలు తమకు ఓటు హక్కు లేదని వివరించారు. తక్షణం ఓటు హక్కు లేని వారందరికీ ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ ను మంత్రి ఆదేశించారు గత రెండు రోజులుగా తుఫాను వల్ల ఇబ్బంది పడిన 44 కుటుంబాలకు ఆర్థిక సహాయం చేశారు. కుటుంబ సభ్యుల సంఖ్యను బట్టి ఆర్థిక సాయం ఉంటుందని తహసిల్దార్ రామ కోటేశ్వరావు వివరించారు మొత్తానికి 72 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం తరపున బాధితులకు అందించినట్లు చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూనసాని గరుడ ప్రసాద్, జడ్పిటిసి సభ్యురాలు మైలా రత్నకుమారి, వైసిపి కన్వీనర్ వైద్యాన్ని వెంకటరాజు, కూనసాని వాసు, కుక్కలు గడ్డ బాపూజీ, మైలా రమేష్, సర్పంచులు పులగం సుబ్రహ్మణ్యం, పాశం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం

విశాలాంధ్ర-గుడివాడ : ముఖ్యమంత్రి జగన్ నాయకత్వంలోని వైసీపీ ప్రభుత్వం ముమ్మాటికి రైతు సంక్షేమ ప్రభుత్వమని, తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతాంగానికి నూరు శాతం సహాయ సహకారాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్నారు. గురువారం గుడ్లవల్లేరు మండలంలోని వడ్లమన్నాడు పరిసర గ్రామాల్లో ముంపునకు గురైన పంట పొలాలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే కొడాలి నాని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖిగా మాట్లాడిన ఎమ్మెల్యే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొర్ల శ్రీను, రవి, విక్టర్, రామకృష్ణ, చంటి, నాగు, సుజాత, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, వ్యవసాయ, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

విశాలాంధ్ర-అవనిగడ్డ : అన్నదాతలకు అండగా ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. గురువారం రమేష్ బాబు తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బిపిటిలు మొలక వచ్చినట్లుగా రైతులు ఆందోళన చెందుతున్నారని, పంట నష్టం అంచనాలు వేసి రైతులకు నష్ట పరిహారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని, రైతులకు ఏ విధంగానూ నష్టపడకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వంలో డెల్టా ఆధునీకరణ పనులలో భాగంగా స్లూయిస్ గేట్లకు మరమతులు చేస్తే నేడు రైతులకు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. అధిక వర్షం కారణంగా నష్టం జరిగిందని, గత 25 సంవత్సరాలుగా ఎప్పుడూ లేని విధంగా అన్నీ శాఖల అధికారులు వైయస్ఆర్ నాయకులు ఎక్కువ నష్టం జరగకుండా నివారించగలిగారన్నారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సీడీ వచ్చే విధంగా అధికారులు పారదర్శకంగా పనిచేస్తున్నారన్నారు. ప్రతిపక్ష నేతలు ప్రభుత్వానికి సూచనలు ఇచ్చే

విధంగా ఉండాలి కానీ రైతులను నీరు కార్చేవిధంగా ఉండకూడదన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల రైతు విభాగ జోనల్ ఇన్‌చార్జ్ కడవకొల్లు నరసింహారావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎం.పి.పి తుంగల సుమతీదేవి, జడ్.పి.టి.సి చింతలపూడి లక్ష్మీనారాయణ, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ నలుకుర్తి పృద్వీరాజ్, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాషా, మాజీ ఉపసర్పంచ్ గాజుల జయగోపాల్ తో పాటు పలువురు పాల్గోన్నారు.

రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి : వెనిగండ్ల

విశాలాంధ్ర-గుడివాడ : మిచౌంగ్ తుఫాను ప్రభావిత ప్రాంతాలలో పంట పొలాలు పూర్తిగా మునిగిపోయాని వెంటనే అధికారులు పంటా నష్టం రైతులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని టిడిపి ఇన్‌చార్జి వెనిగండ్ల రాము అధికారులు కోరారు. బుధవారం నియోజవర్గంలోని గుడ్లవల్లేరు మండలం అంగలూరులో నీట మునిగిన పంటా పొలాలను వెనిగండ్ల రాము పరిశీలించారు. అంగలూరు రైతు భరోసా కేంద్రానికి వెళ్లి అధికారుల నుంచి వివరాలు తెలుసుకుని ఎంఆర్ఓకు ఫోను చేసి నష్టపోయిన రైతులను అదుకోవాలని, సబ్సిడీపై విత్తనాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వేతనాల కోసం ఎస్ఎస్‌సీ సిబ్బంది ఆందోళన

విశాలాంధ్ర-కూచిపూడి : సమగ్ర శిక్ష అభియాన్(ఎస్ ఎస్ ఏ) లో చిరుద్యోగులుగా పనిచేస్తున్న తమకు గత మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో తమ కుటుంబాలు రోడ్లపైకి వచ్చే పరిస్థితి ఏర్పడిందని ఆ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మొవ్వమండల1,2. విద్యాశాఖ అధికారులైన ఎస్ శివశంకరరావు, కె శ్రీలక్ష్మి లకు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగామొవ్వ మండలంలో సి ఆర్ పిలు, ఐ.ఈ.ఆర్.టి, డీఈవో, ఎం.ఐ.ఎస్. కోఆర్డినేటర్, మెసెంజర్, పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్స్ గా విధులు నిర్వహిస్తున్న 15 మంది తమకు సమాన పనికి సమాన వేతనం చెల్లించకపోగా నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవడంతో అర్థాకలితో గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు.

రైతులకు బండి రామకృష్ణ పరామర్శ

విశాలాంధ్ర-మచిలీపట్నం : తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మచిలీపట్నం జనసేన పార్టీ ఇన్చార్జి బండి రామకృష్ణ ప్రభుత్వాని కోరారు. గురువారం మండల పరిధిలోని బుద్దాల పాలెం,బొర్రపోతు పాలెం గ్రామంలో నీట మునిగిన పంట పొలాలను పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని చోట్ల ఒడ్డుకు చేర్చిన ధాన్యం మొలకలు వచ్చాయని రైతులు రామకృష్ణ దృష్టికి తీసుకువచ్చారు.రైతుకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం పూర్తిస్థాయిలో భరించి ఆదుకోవాలని, తడిసిన ధాన్యాన్ని యుద్ధ ప్రాతికిన ప్రభుత్వం కొనుగోలు చేయాలని అలాగే కూలిపోయిన దెబ్బతిన్న ఇళ్లకు వెంటనే నష్టపరిహారాన్ని అందించాలని అధికారుల పర్యవేక్షణ కొరవడిందని తుఫాను బాధిత ప్రాంతాలను అధికారులు పర్యవేక్షించి నష్టపోయిన బాధితులను వెంటనే ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు బొర్రపోతు పాలెం,బుద్దాలపాలెం జన సైనికులు పాల్గొన్నారు.

పంటను కాపాడేందుకు చర్యలు శూన్యం

విశాలాంధ్ర-అవనిగడ్డ : తుఫాన్ వచ్చి వేలాది ఎకరాల పంట మునిగిపోతుంటే పంటను పరిరక్షించేందుకు ప్రభుత్వ చర్యలు శూన్యం అని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని అశ్వరరావుపాలెం, మోదుమూడి గ్రామాల్లో పర్యటించి పంట మునిగిపోయిన రైతులను పరామర్శించారు. గ్రామాల్లోని మైనర్ డ్రియిన్ ల మరమత్తులను చేపట్టకపోవడంతో పోలాలు ముప్పుకు గురైయ్యాయని, ప్రభుత్వం ముందుగా చర్యలు తీసుకుని డ్రియినేజీలు త్రవ్విస్తే నేడు పంట పోలాలు మునిగేవి కావని బుద్ధప్రసాద్ దగ్గర రైతులు వాపోయారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో వర్షపు నీరు నిలవకుండా గ్రామ సర్పంచ్ జెసిబి సహాయంతో డ్రియిన్లు త్రవ్వకాలు జరుపుతున్నారని, ఇదే విధంగా పంట పోలాల్లోని నీరు నిలవకుండా యుద్ధప్రాతిపదికన డ్రియిన్లు త్రవ్విస్తే పంటలు కాపాడుకోవచ్చన్నారు. అశ్వరరావుపాలెం గ్రామ శివారులో మైనర్ డ్రియిన్ లకు పూడిక తీయకపోవడంతో అద్వానంగా తయారు అయ్యిందని, ప్రభుత్వం నిమ్మకు నీరెత్తిన్నట్లుగా వ్యవహరించకుండా వెంటనే స్పందించి పంట నష్ట నివారణకు చర్యలు చేపట్టాలని బుద్ధప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పి లంకమ్మ ప్రసాద్, గ్రామ పార్టీ కన్వినర్ దాసినేని శ్రీనివాసరావు, రేపల్లె శివనాగరాజు రైతులు పాల్గొన్నారు.

ముమ్మరంగా శానిటేషన్ పనులు

విశాలాంధ్ర-అవనిగడ్డ : మండలంలో శానిటేషన్ పనులను ఇఒపి ఆర్‌డి పి శైలజా కుమారి ఆధ్వర్యంలో ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో నాలుగు రోజుల పాటు ఎడతెడపి లేకుండా వర్షాలు పడి మంచినీరు కలుషితం కావడంతో బుధ, గురు వారాల్లో మండలంలోని ప్రతి గ్రామాలను శైలజా కుమారి ఆధ్వర్యంలో శానిటేషన్ పనులు నిర్వహిస్తున్నారు. సీతాయలంక, సింహాద్రి కాలనీ, మండలీపురం, కొత్తపేట వంటి లోతట్టు ప్రాంతాల్లో మురుగు నీరు పారుదల అయ్యేందుకు పనులను వేగవంతం చేశారు. అవనిగడ్డలో కార్యదర్శి తోట శ్రీనివాసరావు అశ్వరరావుపాలెం కార్యదర్శి అవ్వమ్మ, మోదుమూడి, పులిగడ్డ, చిరువోల్లంక గ్రామాల కార్యదర్శి రమాకుమారి, రామచంద్రాపురం కార్యదర్శి శేషగిరి, వేకనూరు, తుంగలవారిపాలెం గ్రామాల కార్యదర్శి పవన్ శానిటేషన్ పనులను ముమ్మరం చేశారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

విశాలాంధ్ర-పెడన: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పట్టణ పార్టీ అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ అప్పారావు శ్రేణులు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనందోత్సాహాలతో గురువారం బస్టాండ్ సెంటర్ మరియు బంటుమిల్లి రోడ్డు సెంటర్లో కేక్ కట్ చేసి టపాసులు పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు మహమ్మద్ ఫిరోజ్ బేగ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఆకురాతి జనార్దన రావు, లీలా కృష్ణ, పెడన మండల అధ్యక్షులు ఎం ప్రసాదరావు, కార్యదర్శి సురేష్ అభిమానులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

వరి పొలాలను పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర-కూచిపూడి : 'తుఫానులో ముంపు పాలైన పొలాలను, కోసిన వరిపనలపై ఉన్న పొలాలను రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు పర్యటించారు. వీఆర్వో, వ్యవసాయ గ్రామ సహాయకులు పరిశీలించి ముంపు పాలైన పొలాల వివరాలను నమోదు చేసుకుంటున్నారు. మొవ్వ వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ అధికారి సూరపనేని శ్యామల, మండల వ్యవసాయ అధికారి కంచర్ల శివప్రసాద్, తాసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్ తదితరులు నిడుమోలు, అవురుపూడి, చిన్నముత్తేవి, కూచిపూడి, మొవ్వ, నరసం పాలెంతదితర ప్రాంతాలలో వారి వారి సిబ్బంది సహకారంతో పరిశీలించారు. మండలంలో 24, 591ఎకరాల్లో వరిసాగుకాగా, 15,663 ఎకరాలు కోయాల్సి ఉందని వివరించారు. అలాగే కోసిన 2473 ఎకరాలు పనమీద ఉందని వివరించారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ

విశాలాంధ్ర-మచిలీపట్నం : యునైటెడ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్టర్స్ కౌన్సిల్ , మైత్రి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్ లోని యు హెచ్ ఆర్ పి సీ కార్యలయం నందు దివ్యాంగులకు గురువారం ఉచితంగా బస్ పాసులు ట్రైన్ పాసుల మేగా క్యాంప్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా దివ్యాంగుల అధ్యక్షురాలు డాక్టర్. అమ్మిరెడ్డి రజని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బందరు నియోజకవర్గ జనసేన నాయకులు బండి రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక లోపంతో పుట్టడం శాపం కాదని మానసికంగా బలంగా ఉంటే ఏదైనా సాధ్యమేనని కాబట్టి జీవితంలో ప్రతి ఒక్కరూ ధైర్యంగా ముందుకు సాగాలని ఆమె అన్నారు. ఈకార్యక్రమంలో మైత్రీ ఫౌండేషన్ సభ్యులు బిబిఎస్ ప్రసాద్, చెంచయ్య, అనిల్, రమాదేవి, మొబిన్, రిలాక్స్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పౌరరక్షణ కోసం మాక్‌డ్రిల్ : డీఆర్ఎం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రైల్వేస్టేషన్‌లో గాని సమీప ప్రాంతాల్లో అకస్మాత్తుగా బాంబు పేలుడు వంటి ప్రమాదం సంభవిస్తే ప్రయాణికులు,ప్రజల ప్రాథమిక ప్రాణ రక్షణ చర్యలు ఏ విధంగా తీసుకోవాలో అందుకు రెస్క్యూ ఆపరేషన్‌ల ద్వారా తక్షణం వైద్య సహాయం,ప్రాణాలు కాపాడటం వంటివి సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ (సిడిఓ) ఆధ్వర్యంలో గురువారం విజయవాడ రైల్వే స్టేషన్ సర్క్యులేటింగ్ ఏరియాలో మాక్ డ్రిల్‌ను నిర్వహించారు.దీనికి ముఖ్య అతిథిగా డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ. పాటిల్ విచ్చేసి ప్రార:భించారు.ఈ మాక్ డ్రిల్‌ను నిర్వహించడం యొక్క ప్రాథమిక లక్ష్యం సంఘటనా స్థలంలో ప్రథమ చికిత్స అందించడం ద్వారా ఏదైనా అవాంఛనీయ సంఘటనల సమయంలో మునుపటి ప్రాణాలను రక్షించడం,ప్రమాద కారణాన్ని తగ్గించడం ద్వారా వారిని చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రికి తరలించడం ద్వారా ఉద్దీపన పద్ధతుల్లో కీలక పాత్ర

పోషించేలా సిబ్బందికి శిక్షణ ఇవ్వడం.ప్రాథమిక పౌర రక్షణ శిక్షణలో భాగంగా సిడిఓ బృందం ఇప్పటికే ఎస్సీఆర్ జోన్‌లో నాలుగు శిక్షణా శిబిరాలను నిర్వహించింది, ప్రస్తుతం విజయవాడ డివిజన్ సిబ్బంది,సాధారణ ప్రజలకు ప్రాథమిక ప్రాణ రక్షణ చర్యలు రెస్క్యూ ఆపరేషన్‌లను అందజేస్తోంది.ఈ సందర్భంగా డిఆర్ఎం మాట్లాడుతూ అకస్మాత్తుగా బాంబు పేలుడుతో అనేక మంది ప్రాణనష్టానికి దారితీసింది.సిడిఓసిబ్బంది, రైల్వే సిబ్బంది వెంటనే స్పందించి గాయపడిన వారిని రక్షించడానికి సహాయక చర్యలను ప్రారంభించారు. ఈ మాక్ డ్రిల్ తక్షణ అత్యవసర పరిస్థితులతో వ్యవహరించడం, ప్రజలను రక్షించడం విపత్తు కారణంగా ధ్వంసమైన లేదా దెబ్బతిన్న ముఖ్యమైన సేవలు,సౌకర్యాలను పునరుద్ధరించడం లక్ష్యం అన్నారు. అనంతరం డిఆర్ఎం సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ అత్యుత్తమ ప్రదర్శనకు రూ.50,000 గ్రూప్ క్యాష్ అవార్డును ప్రకటించారు.ఈ కార్యక్రమంలో ఏడిఆర్ఎం డి. శ్రీనివాసరావు(ఇన్ఫ్రాస్ట్రక్చర్), ఎమ్.శ్రీకాంత్, (ఆపరేషన్స్),డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ సివిల్ డిఫెన్స్ కెఎల్ఎన్ స్వామి, సీనియర్ సిడిఓ టి.సుధీర్‌బాబు,భారత్ స్కౌట్స్& గైడ్స్,ఇతర సూపర్‌వైజర్లు,సిబ్బంది పాల్గొన్నారు.

పేరు మార్పు

Settipalli Pushpa Latha, W/o. Ganesh Chandra, 5-99/17, వెంకటరామ గార్డెన్స్, జాబిల్లి హాస్పిటల్ రోడ్, పోరంకి, పెనమలూరు మం. కృష్ణాజిల్లా, ఆం.ప్ర. 521137. అను నేను నా పేరును **Setipalli Pushpa Latha** (పాత పేరు)ని **Settipalli Pushpa Latha** (కొత్త పేరు)కి మార్చబడినది. ఇక నుండి నా పేరు **Settipalli Pushpa Latha W/o. Ganesh Chandra** అని పిలుస్తారు.

ఉన్నం లక్ష్మయ్యకు సీపీఐ, రైతు సంఘం నేతల నివాళి

విశాలాంధ్ర-గంపలగూడెం : మండలంలోని సోబ్బాల గ్రామానికి చెందిన సీపీఐ మండల కార్యదర్శి ఉన్నం సాంబశివరావు తండ్రి ఉన్నం లక్ష్మయ్య ఇటీవల మృతి చెందారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పటాపంచల జమలయ్య, జిల్లా రైతు సంఘం నాయకులు మల్నీడు యలమందరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చిలుకూరు వెంకటేశ్వరరావు, సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగుల్‌మీరా, సర్పంచ్ ఉన్నం కృష్ణారావు తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

విరాళాలు సేకరణలో ....
దక్షిణ భారత్‌లో జిల్లా ఫస్ట్

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : సాయుధ దళాల పతాక నిధికి విరాళాల సేకరణలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిపిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. సాయుధ దళాల పతాకనిధికి విరాళాల సేకరణలో దక్షిణ భారతదేశంలో, రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉండేందుకు కృషి చేసిన కలెక్టర్‌కు సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని(ఫ్లాగ్ డే) సందర్భంగా గురువారం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా కలెక్టర్ ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఆర్మడ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే-2022లో దక్షిణ భారత దేశంలోనే కాకుండా రాష్ట్రంలోనే మన జిల్లా అత్యధికంగా విరాళ నిధిని సమకూర్చడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో రూ.41,22,921 పతాక నిధిని సేకరించడం జరిగిందని, ఈ విరాళాలు అందజేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు కలెక్టర్ తెలిపారు.

విరాళాలు అందించి సైనిక కుటుంబాలను ఆదుకోండి

దేశ రక్షణకు ప్రాణాలను అర్పించిన సైనిక కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అందుకు సాయుధ దళాల పతాక నిధికి విరివిగా విరాళాలు అందించాలని జిల్లా కలక్టర్ ఎస్.ఢిల్లీరావు పిలుపునిచ్చారు. సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం కలెక్టర్ సాయుధ దళాల పతాక నిధికి విరాళాన్ని అందించి జిల్లా సైనిక సంక్షేమ అధికారి నుండి పతాకాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సాయుధ దళాల పతాక దినోత్సవ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో సైనికులు, మాజీ సైనికుల కుటుంబ సభ్యులకు కలెక్టర్ పతాక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి మాట్లాడుతూ దేశ గౌరవాన్ని కాపాడేందుకు సరిహద్దుల్లో ధైర్యంగా పోరాడి వీరమరణం పొందన సైనికులకు నివాళులర్పించి వారి కుటుంబాలకు అండగా నిలిచే సంకల్పంతో 1949 సంవత్సరం నుండి ప్రతి ఏడూ డిసెంబర్ 7న సాయిధ దళాల పతాక దినోత్సవాన్ని పాటిస్తున్నామన్నారు. భారత సైనికులు మొక్కవోని దీక్షతో చూపుతున్న దేశభక్తి, సాహసం, త్యాగాల పట్ల దేశం గర్విస్తుందన్నారు. పాకిస్తాన్, చైనాలతో యుద్ధం, కార్గిల్ పోరాటం, ముంబై తాజ్ హోటల్‌పై దాడి వంటి సంఘటనలతో పాటు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు భారత జవాన్లు ధైర్యసహసాలు, తెగువకు, వీరమరణం పొందిన జవానులు వల్ల జాతి యావత్తు గర్విస్తోందన్నారు. మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామంటే అందుకు కారణం మన సైనికులు కల్పించే రక్షణే కారణమన్నారు. పతాక నిధికి అందించే విరాళాలలకు ఆదాయ పన్ను రాయితీ లభిస్తుందని, స్వచ్ఛందంగా విరాళాలు అందించేందుకు ముందుకు వచ్చేవారు జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎన్టీఆర్ జిల్లా, ఎస్‌బీఐ ఖాతా 62067742138 బీఎస్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్ 0020899 ద్వారా నేరుగా విరాళాలు అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు, సైనిక సంక్షేమ సంఘం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం : సామినేని

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : తుపాన్‌తో పంట నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని, పంటల రక్షణ, తడిసిన, రంగు మారిన ధాన్యం కొనుగోలు ప్రభుత్వం చేస్తుందని, అధైర్య పడద్దని రాష్ట్ర ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గం, పెనుగంచిప్రోలు మండలం, ముచ్చింతాల, అనిగండ్లపాడు, గుమ్మడిదూరు గ్రామాలలో ఉదయభాను గురువారం పర్యటించి దెబ్బతిన్న వరిపొలాలు, ధాన్యం రాశులు పరిశీలించి రైతులతో మాట్లాడి పంట నష్టం గురించి రైతుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు చేతికి వచ్చిన పంటలు దెబ్బతినడం బాధాకరమన్నారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వర్షపు నీరు తగ్గిన వెంటనే వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేస్తారని తెలిపారు. అదే చంద్రబాబు పాలనలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు చాలా ఉన్నాయని, నేడు జగనన్న ప్రభుత్వంలో అలాంటి సంఘటనలు ఎక్కడ జరగడం లేదన్నారు. నియోజకవర్గంలో పంటలను నష్టపోయిన రైతులకు తప్పకుండా న్యాయం చేస్తామని ఉదయభాను హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మార్కాపూడి గాంధీ, జెడ్పీటీసీ ఊట్ల నాగమణి. మండల వైసిపి పార్టీ అధ్యక్షులు కనకపూడి భాస్కరరావు, మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు, పూసల సంఘం డైరెక్టర్ చేనికుమారి, ముచ్చింతాల సర్పంచ్ జక్కులూరి రాంబాబు, అనిగండ్లపాడు. సర్పంచ్ బి.జ్యోతి బ్రహ్మం, గుమ్మడిదుర్రు సర్పంచ్ నక్క సుధాకర్, కమల రంగిశెట్టి దుర్గారావు, స్థానిక వైసీపీ నాయకులు, వ్యవసాయశాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

తిరువూరు నియోజకవర్గంలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి

విశాలాంధ్ర-విజయవాడ(తిరువూరు) : తిరువూరు నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులను, పేదలను ఆదుకోవాలని సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి ఎస్కే నాగూల్ మీరా, నగర కార్యదర్శి మాలపటి ఉదయ్ తిరువూరు ఆర్డీఓను కోరారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఆర్డీవో అన్ని రాజకీయాల పార్టీ తో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఐ పార్టీ తరఫున పాల్గొన్న వారు నియోజకవర్గంలోని సమస్యలను వివరించారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ రెండు నెలల క్రితం వర్షాభావ కారణంగా ఎన్టీఆర్ జిల్లా నాలుగు మండలాల్లో నష్టపోయిన ప్రాంతాలను కరువు మండలాలుగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరగా గంపలగూడెం, తిరువూరు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారన్నారు. ఏ. కొండూరు, విస్సన్నపేట మండలాలను కూడా కరువు మండలాలుగా ప్రకటించాలని సచివాలయాల వద్ద వినతి పత్రాలు ఇవ్వటం జరిగిందని ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. మిచౌంగ్ తుఫాను కారణంగా రైతు నష్టపోయిన పంటను ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలని, వ్యవసాయ కూలీలు పేదల కుటుంబాలకు నెలకు పదివేల రూపాయలు కరువు పెన్షన్ ఇవ్వాలని, నెల నెలా 35 కేజీల బియ్యం ఇతర నిత్యవసర సరుకులు ఉచితంగా ఇవ్వాలని కోరారు. గామీణ ఉపాధి హామీ చట్టం పనులను తక్షణమే ప్రారంభించాలని, ఉపాధి హామీలు 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజు వేతనం 600 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తాము సూచించిన అంశాలపై సానుకూలంగా స్పందించిన ఆర్డీఓ ఈ సమస్యలను కలెక్టర్‌తో దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చినట్లు వివరించారు.

కృష్ణానదికి పెరిగిన వరద

ప్రకాశం బ్యారేజ్ గేట్లు ఎత్తి నీటిని సముద్రంలోకి విడుదల



విశాలాంధ్ర-విజయవాడ : మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురవటంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ క్రమంలో కృష్ణానదిలో వరద ప్రవాహం పెరిగింది. ఫలితంగా ప్రకాశం బ్యారేజీ వద్ద కొన్ని గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఉదయం 10 గంటలకు తొలుత నాలుగు గేట్లను ఒక్క అడుగు మేర ఎత్తారు. ఎగువ నుంచి 6,667 క్యూసెక్కులు వస్తుండగా దిగువకు 2,908 క్యూసెక్కులు విడుదల చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు ఎగువ నుంచి వరద 9, 672 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో 10 గేట్లు ఒక్క అడుగు మేర ఎత్తి దిగువకు 7, 450 క్యూసెక్కులు విడుదల చేశారు. సాయంత్రం 5 గంటలకు ఎగువ నుంచి సుమారు 20 వేల కూసెక్కుల వరద నీరు రాగా 25 గేట్లు ఎత్తి సముద్రంలోకి 18వేల క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యారేజీకి వరద ప్రవాహం నెలకొన్న నేపథ్యంలో జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. కేసీ డివిజన్ ఈఈ కృష్ణారావు వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

రైతులెవ్వరూ అధైర్యపడొద్దు : కలెక్టర్

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : రైతులెవ్వరూ అధ్యైర్యపడాల్సిన అవసరం లేదని ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో పంట నష్టాన్ని అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. మిచాంగ్ తుపానుకు కురిసిన వర్షాలు వల్ల పంటలు, రహదారులు తదితరాలపై చూపిన ప్రభావంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్.జవహర్‌రెడ్డి గురువారం నిర్వహించిన సమీక్షలో స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మిచాంగ్ తుపాను నేపథ్యంలో భారీ వర్షాల వల్ల ముంపునకు గురైన పంట పొలాల నుంచి పూర్తిస్థాయిలో నీరు బయటకు పంపటం జరుగుతోందని, అనంతరం పంట నష్టాలను అంచనా వేసేందుకు వ్యవసాయ, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 34,716 ఎకరాల్లో వరి, 1668 ఎకరాల్లో పత్తితో పాటు మొత్తం 39,413 ఎకరాల్లోని వివిధ పంటలు ఒరగడం, ముంపునకు గురికావడం, పాక్షికంగా ముంపునకు గురియ్యాయన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే పొలాల నుంచి నీరు సాఫీగా బయటకు పోయేలా జేసీబీలను కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నష్టపోయిన ప్రతి రైతుకు ఏ సీజన్లో జరిగిన పంట నష్టానికి ఆ సీజన్ ముగిసేలోపే పరిహారం అదివ్వటం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి నాగమణిమ్మ, జిల్లా ఉద్యాన అధికారి బాలాజీ కుమార్ పాల్గొన్నారు.

రైతులను తక్షణమే ఆదుకోవాలి

విశాలాంధ్ర-కంచికచర్ల: మండలంలో తుఫాన్‌తో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వంవెంటనే ఆదుకోవాలని నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య డిమాండ్ చేశారు.ఇటీవల మీచంగ్ తుఫాన్ వల్ల పరిటాల గ్రామంలోదెబ్బతిన్న పంట పోలాలను మాజీ ఎమ్మెల్యేరైతులు మరియుదేశం శ్రేణులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ ఈ రైతులు కాయ కష్టం చేసి తమ పండించిన పంట చేతికి వచ్చే లోపే అకాల వర్షాల వలన చేతికి వచ్చిన పంట నీటి పాలైనదని మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆరోపించారు. పరిటాల గ్రామ నందు మొక్కజొన్న 300 ఎకరాలు వరి పంట 700 ఎకరాలు నీటిపాలై రైతులు కన్నీరు కారుస్తుంటే ఏ అధికారి కానీ ఎమ్మెల్యే ఎమ్మెల్సీలు ఆ రైతులు వంక పలకరించిన నాధుడే లేడని మాజీ ఎమ్మెల్యే సౌమ్య ఆవేదన వ్యక్తపరిచారు. గ్రామాలలో రైతులు పంటలు దెబ్బతిని అల్లాడుతుంటే ఇమ్యురేషన్ చేయాలనే ఆలోచన కూడా ఈ ప్రభుత్వానికి రాకపోవడం ఏమిటి అని మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంటలు దెబ్బతిన్న రైతులనుతక్షణమే ఆదుకోవాలని

మాజీ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. దెబ్బతిన్న రైతన్నలను వెంటనేఆదుకో పోతే తెలుగుదేశం ప్రభుత్వం రైతులను ఈ ప్రభుత్వం ఆదుకునే అంతవరకు ఈ పోరాటాలు ఆపే ప్రసక్తి లేదని మాజీ ఎమ్మెల్యే హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు మాగంటి బాబు,

ఉచిత పరదాల పంపిణీకి అడ్డు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఉచితంగా టార్పాలిన్ పట్టాల పంపిణీ అడ్డుకోవటంతో కార్యక్రమం వివాదంగా మారింది. అధికారపార్టీకి చెందిన దాత బరిగెల కోటేశ్వరరావు తుఫాను ధాటికి నష్టపోయిన రైతులకు తనవంతు సాయంగా బుధవారం ఉచిత టార్పాలిన్ పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక లయన్స్‌క్లబ్ ప్రాంగణంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న సమంలో ఇదే పార్టీకి చెందిన పలువురు నాయకులు అక్కడికి చేరి, అడ్డుకున్నారు. తమ పార్టీ స్థానిక నేతలకు సమాచారం ఇవ్వకుండా ఇలా పంపిణీ చేయటాన్ని నిరసిస్తూ కార్యక్రమాన్ని నిలువరించారు. దీంతో కోటేశ్వరరావుకు, మరికొందరు స్థానిక నేతలకు వాగ్వాదం తలెత్తగా, స్థానిక నేతల సమాచారంతో ఎస్ఐ జీవివి.సత్యనారాయణ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. స్థానిక నేతల ఫిర్యాదుతో అనుమతి లేకుండా పట్టాల పంపిణీ తగదంటూ కార్యక్రమాన్ని నిలిపివేయించారు. ఈ విషయమై కోటేశ్వరరావు మాట్లాడుతూ, సీఎం జగన్ ఆపదలోఉన్న రైతులను ఎవరి స్థాయిలో వారు ఆదుకోవాలంటూ ఇచ్చిన పిలుపు మేరకు తనవంతు సాయంగా రైతులను ఆదుకునేందుకు కార్యక్రమం చేపట్టామన్నారు. స్థానిక నేతలు దీనిని వివాదం చేసి, అడ్డుకున్నారని, మరొకొద్దిరోజుల్లో రైతులకు తనకు తోచిన స్థాయిలో టార్పాలన్ పట్టాలు పంపిణీ చేయనున్నామని వెల్లడించారు.

ఇబ్రహీంపట్నం ఎస్ఐగా ధర్మరాజు

విశాలాంధ్ర-ఇబ్రహీం పట్నం : జి కొండూరు పోలీస్ స్టేషన్ నందు పనిచేస్తున్న ధర్మరాజు ఇబ్రహీంపట్నం స్టేషన్కు బదిలీ అవ్వడంతో బుధవారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ నందు ఎస్సైగా బాధ్యతలు స్వీకరించగా, ఇబ్రహీంపట్నంలో ఇప్పటికే ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న మణి విజయవాడ బదిలీపై వెళ్లనున్నారని స్థానిక పోలీసులు తెలిపారు.

విద్యార్థినికి ఫేక్ ఫోటోతో వేధింపులు!

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): విద్యార్థిని ఫోటో మార్ఫింగ్ చేసి వేధింపులకు గురి చేస్తున్న ఘటన విజయవాడ పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం నగరానికి చెందిన యువతి పశ్చిమ గోదావరిలో డీగ్రీ వరకు చదువు పూర్తి చేసింది. ఇటీవలే నగరానికి తిరిగి వచ్చింది. రెండు రోజుల క్రితం గుర్తుతెలియని దుండగులు ఆ విద్యార్థిని ఫోటో మార్ఫింగ్ చేసి టెలీగ్రాం యాప్‌లో పెట్టారు. తరువాత రోజు కూడా వాట్సాప్‌కు పంపి వేధింపులకు గురి చేశారు. ఫోటో చూసి భయాందోళనకు గురైన విద్యార్థిని పటమట పోలీసులను ఆశ్రయించింది. ఈమేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక పింఛన్లు పెంచాలి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): సామాజిక పింఛన్‌లు పెంచాలని మహిళా సమైఖ్య నగర ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ దుర్గాశీ రమణమ్మ అన్నారు. గురువారం విజయవాడ 51వ డివిజన్‌లోని ఆంధ్రప్రదేశ్ మహిళా సమైఖ్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) అధ్వర్యంలో సామాజిక పింఛన్‌లు పెంచాలని స్థానిక సచివాలయంలోని సెక్రటరీకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, చేనేత, గీత, మత్స, ఒంటరి మహిళ, కళాకారులు తదితరలుకు పింఛన్ నెలకు రూ.2750 నుంచి రూ.6వేలకు పెంచాలన్నారు. వికలాంగులకు పింఛన్ నెలకు రూ.3వేలు నుంచి రూ.7వేలు పెంచాలని కోరారు. సామాజిక పింఛన్ పెంపుదలకు వ్యక్తిగత ధరఖాస్తులు స్వీకరించి సచివాలయంలో అందజేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు సావిత్రి, ఏ ఏసు, అప్పల నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పెంచాలని వినతి

విశాలాంధ్ర-విజయవాడ : పెరుగుతున్న ధరలను అనుగుణంగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఇచ్చే పింఛన్‌ను పెంచాలని ఏపీ మహిళా సమాఖ్య నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మహిళా సమాఖ్య 7వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మొగల్రాజురంలోని 40వ వార్డు సచివాలయంలో గురువారం పింఛన్‌దారులతో కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి బి.శాంత మాట్లాడుతూ 14 రకాల నిత్యాసర వస్తువులను సబ్సిడీ ధరలకు ప్రజాసంపిణీ ద్వారా ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు. వంట గ్యాస్ సిలిండర్ రూ.500లకు, పెట్రోల్ లీటరు రూ.60లకు, డీజిల్ లీటర్‌రూ.50లకే ఇవ్వాలని కోరారు. సంక్షేమ పథకాల అమలులో భాగంగా వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, చేతి వృత్తిదారులకు నెలకు రూ.5వేలు, దివ్యాంగులకు నెలకు 6వేల రూపాయలు డిమాండ్ చేశారు. కుటుంబంలో ఉన్న అర్హులైన వారందరికీ పింఛన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ గౌరవాధ్యక్షులు ఏ.దేవి, నాయకులు బి.సత్యవతి, మాడెం లక్ష్మి, సామాల లక్ష్మి, జి.సింహాచలం, కె.కాంతమ్మ, జి.వరలక్ష్మి, ఎం.అప్పలనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాయుతంగా గ్రంథాలయాల అభివృద్ధి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ప్రజలకు విజ్ఞానాన్ని పంచి వారి సర్వతోముఖాభివృద్ధికి సోపానాలు వేస్తున్న గ్రంథాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తున్నట్లు కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. ఠాగూర్ స్మారక జిల్లా గ్రంథాలయంలో అదనపు హాల్, స్టేజ్, సైకిల్ షెడ్లను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆయన ట్లాడుతూ జీవన వికాసానికి గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని, జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. పాఠకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఠాగూర్ స్మారక జిల్లా గ్రంథాలయంలో రూ.55 లక్షల డీఎంఎఫ్ నిధులతో అదనపు హాల్, స్టేజ్, సైకిల్ షెడ్లను ఏర్పాటు, మునుముందు అవసరం మేరకు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి నగేష్, పాలకులు రమాదేవి, ఉమారాణి, దనలక్ష్మి, సిబ్బంది రాంబాబు, శంకర్, కుమార్, ఫణిబాబు పాల్గొన్నారు.

ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుంది : ఎమ్మెల్యే మొండితోక

విశాలాంధ్ర- నందిగామ: ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టం పై వ్యవసాయ, ఉద్యావన శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ప్రాథమిక అంచనాలు రూపొందిస్తున్నారు. నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని గురువారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు అన్నారు. కంచల గ్రామంలో వరి పంట ఇంకా ముంపు లోనే ఉంది.కోత దశలో తుఫాను రావటం.పంట పూర్తిగా దెబ్బ తినడం ఆవేదన కలిగిస్తుందన్నారు. గతంలో కూడా తుఫాన్ల కారణంగా నష్టపోయిన రైతులకు జగనన్న

ప్రభుత్వం ఇన్ పుట్ సబ్సిడీ, పంట నష్ట పరిహారం అందజేసి అండగా నిలిచింది. రైతుల నుంచి తడిసిన ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేస్తుంది. ఈ విషయంలో రైతులు అధైర్య పడవద్దని సూచించారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు .

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: తుఫాను కారణంగా తిరువూరు నియోజకవర్గంలో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ నేత చిలపరపు వెంకటేశ్వరరావు కోరారు. మండలంలోని పుట్రేల, తెల్లదేవరపల్లి గ్రామాల్లో తుఫాను కారణంగా పాడైన వరి పంటను గురువారం ఆయన పరిశీలించారు. నియోజకవర్గ వ్యాప్తంగా వందల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం, అధికారులు రైతులకు సరైన సలహాలు సూచనలందించటంతోపాటు, ఆర్థిక పరిహారం అందేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. తేమశాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని చూపాలన్నారు. నియోజకవర్గంలో పంటలను పరిశీలించిన అనంతరం రాష్ట్రస్థాయి అధికారులను కలసి, రైతు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన వివరించారు. ఆయనతోపాటు గుంట్ల ఏసోబు, అరిగెల రాంబాబు, నల్లగట్ల ప్రకాశరావు, సిహెచ్.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గణతశాస్త్రంలో నాగలక్ష్మికి డాక్టరేట్

విశాలాంధ్ర-కంచికచర్ల: కంచికచర్ల మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ లో అధ్యాపకురాలుగా పనిచేస్తున్న ఎస్. నాగలక్ష్మి గణిత శాస్త్రంలో గుంటూరు కేఎల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. గణిత శాస్త్ర విభాగంలో గ్రాన్యులర్ అప్రోచ్ ఫర్ ఫజ్జి ఇనీషియల్ అండ్ టు పాయింట్ బౌండరీ వ్యాల్యూ ప్రాబ్లమ్స్ విత్ అప్లికేషన్స్ అను అంశంపై ఎస్. నాగలక్ష్మి చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టీ. వంశీ కిరణ్ తెలిపారు. దీనివలన ఇంపార్టెంట్ ఇంజనీరింగ్ అండ్ ఫిజికల్ అప్లికేషన్స్ ను సాల్వ్ చేయటం జరుగుతుందని డాక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగలక్ష్మిని మిక్ ఇంజనీరింగ్ కళాశాల సీఈవో డి. పాండు రంగారావు, మేనేజ్మెంట్ నెంబర్ ఎం. సుహాస్, ప్రిన్సిపల్ డాక్టర్ టి వంశీ కిరణ్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

ప్రకటన

నా క్లయింటు ఎన్.టి.ఆర్ జిల్లా, రామవరప్పాడు హనుమాన్ నగర్, ఫ్లాట్ నెం.ఎఫ్.ఎఫ్. 3రు శ్రీ సాయిలక్ష్మి గణపతి హోమ్స్ కాపురస్తురాలు **కఠారి సుబ్బారావు గారి భార్య కఠారి విజయలక్ష్మి గారి** యొక్క నంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా..

నా క్లయింటుకు చెందిన సంతకము చేయని ఖాళీ చెక్కులు అనగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏలూరు రోడ్డు బ్రాంచి విజయవాడకు చెందిన నెం. **520078** నుంచి **520080** వరకు గల **3** చెక్కులు **ది. 30-11-2023వ తేదీన** ఆమె ఇంటి వద్దనుండి రామవరప్పాడు రింగ్ సెంటర్‌కి వచ్చేటప్పుడు చెక్కులు గల బ్యాగు పోయినది. కనుక ఎవ్వరికైనసూ సదరు బ్యాంక్ చెక్కులు దొరికిన యెడల నాకుగాని నా క్లయింట్‌కి గాని అప్పగించగలరు. నా క్లయింట్ ఆమె యొక్క బ్యాంకుకు " **స్టాప్ పేమెంటు** " కూడా యిచ్చి యున్నది. సదరు చెక్కులను ఉపయోగించి జరిపే ఎటువంటి లావాదేవీలు నా క్లయింటును బైండ్ చేయజాలవు మరియు నా క్లయింట్ తీసుకొనే చట్టపరమైన చర్యలకు బాధ్యత వహించవలసి వుంటుందని తెలియజేయడమైనది.

కొల్లు కృష్ణ కిషోర్ కుమార్, బి.ఎస్.సి. బి.ఎల్.
న్యాయవాది - నోటరీ,
గాంధీనగర్, విజయవాడ-3,
ఫోన్స్: 9849183148, 8919630195
విజయవాడ, ది.07-12-2023

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT VIJAYAWADA

ACP No. 275 of 2021

Between:
PAVITRA CHIT FUND PVT.LTD. Vijayawada, rep. by It's Foreman & Managing Director Chigurupati Nageswara Rao - DISPUTANT

AND

Vangala Srinivasa Reddy and others - OPPONENTS

To,
Velagapudi Srikanth, (Opponent No. 2) Son of Rama Prasad, Resident of D.No. 56-10-21, Road No.2, Pantakaluva Road, Patamata, Vijayawada.
(Opponents No.2)

Please take notice that the above Claim Petition had filed for recovery of Chit amount and the Hon'ble Authority ordered notice to you and posted the case to **22-12-2023** for your appearance. So you are here by requested to appear before Deputy Registrar of Chits at the office of District Registrar, D.No. 56-6-7A, Opposite to Priya Children Hospital, Pantakaluva Road, Maruthi Colony, Patamata, Vijayawada-520010 to answer the claim on **22-12-2023 at 10-30 A.M.** in person, failing which the matter will be decided in your absence.

(By order of the Hon'ble Deputy Registrar of Chits, Vijayawada)

A. PRASOON KUMAR, Advocate, D.No.25-104 F2, Sri Chakra Apartment, Yanamalakuduru, Vijayawada-7
Date of Adjournment: 22-12-2023

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోండి : జనసేన

విశాలాంధ్ర-గంపలగూడెం : గంపలగూడెం మండలంలో మిచౌంగ్ తుఫాన్ వల్ల నష్టపోయిన పంట పొలాలను క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించిన జనసేన నాయకులు.. గురువారం మండలంలోని ఆర్లపాడు ,గాదివారిగూడెం , మేడూరు తదితర పరిసర ప్రాంత గ్రామాలలో తుఫాను వల్ల దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన జనసేన పార్టీ తిరువూరు నియోజకవర్గ సమన్వయకర్త మనుబోలు. శ్రీనివాసరావు, మరియు మండల అధ్యక్షుడు చింతలపాటి .వెంకట కృష్ణారావు. ఈ సందర్భంగా వారిరువురు మాట్లాడుతూ మండలంలో సుమారు 5000 ఎకరాలు మిర్చి సాగు ద్వారా జీవనం సాగిస్తున్న చిన్న, సన్నకారు రైతులను మిచౌంగ్ తుఫాన్ నట్టేట ముంచిందని, ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితుల వలన ఎకరం మిర్చి సాగుకు కనీసం లక్షన్నర రూపాయల ఖర్చైందని,గోరుచుట్ట పై రోకలి పోటులా మిచౌంగ్ తుఫాన్ విరుచుకు పడిందని వారన్నారు. మిర్చిపంట పెట్టుబడికి లక్షన్నరకి తోడు, తుఫాన్ వల్ల ఎకరానికి పది

క్వింటాళ్ల మిర్చి పైరు దిగుబడి తగ్గటమే గాక నాణ్యత కూడా లోపిస్తుందని గాలికి పడిపోయినటువంటి మిరప మొక్కలను కూలీలతో సరిచేయడానికి పదివేల రూపాయలు ఖర్చు అవుతుందని రైతులు స్వయంగా తెలియజేస్తున్నారని అన్నారు. అలానే మిర్చి పంటతో పాటు నీట మునిగిన వరి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందని మండలంలో చాలా గ్రామాల్లో వరి పంట మునిగిపోవడం వల్ల ధాన్యం మొలకెత్తిందని సాధ్యమైనంత వరకు నీట మునిగిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, ఎకరం వరి పొలానికి 20 వేల రూపాయలు తక్షణ సాయం కింద అలానే మిర్చి రైతులకు తక్షణ సాయం కింద ఎకరానికి 50వేల రూపాయలు రైతులకు ఇవ్వాలని జనసేన పార్టీ తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని వారన్నారు. అనంతరం జనసేన పార్టీ ఆధ్వర్యంలో మండల తాసిల్దార్ కి, వ్యవసాయ శాఖ అధికారులకు డిమాండ్ల తో కూడిన వినతి పత్రం జనసేన పార్టీ తరఫున అందజేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల కార్యవర్గ సభ్యులు వట్టి కొండ .కృష్ణ, పసుపులేటి. మాధవరావు, దండేల. తిరుపతిరావు, ఓరుగంటి. సురేష్, పసుపులేటి. మల్లికార్జునరావు, కొంకి. రవి, పసుపులేటి. సాంబశివరావు, మిరియాల .అంజన్న బాబు, కొంకి .బాలకృష్ణ, పసుపులేటి .రామకృష్ణ, కృష్ణ ఆంజనేయులు, రామయ్య, గాదె .గోపి, పసుపులేటి. శివకృష్ణ,మిరియాల. శ్రీను తదితరు జనసైనికులు, మరియు రాఘవరపు రమేష్, రైతులు పాల్గొన్నారు.

ఎస్టీపీఐ, టై దిల్లీ-ఎన్సీఆర్ ఆధ్వర్యంలో

లీప్ ఎహెడ్ స్టార్టప్ సమ్మిట్

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: నిరంతర భాగస్వామ్యంలో భాగంగా సాఫ్ట్ వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇం డియా (ఎస్టీపీఐ), ది ఇండస్ ఎంటర్ ప్రెన్యూర్స్ (టై దిల్లీ-ఎన్సీఆర్) కలసి లీప్ ఎహెడ్ ఇనిషియేటివ్ ను విజ యవాడకు విస్తరించాయి. విజయవాడ చాప్టర్ కోసం వర్చువల్ ఈవెంట్ అయిన లీప్ ఎహెడ్ స్టార్టప్ స మ్మిట్‌ని నిర్వహించడానికి టై దిల్లీ-ఎన్సీఆర్, టై విజయవాడతో మరింతగా సహకరించినట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ది. టెక్ స్టార్టప్‌లను ఎంచుకోవడానికి దేశవ్యాప్త కార్యక్రమం అయిన లీప్ అహెడ్ (లాంచ్ ప్యాడ్ ఫర్ టెక్ ఆంత్ర ప్రెన్యూర్స్ టువర్డ్స్ యాక్సిలరేటెడ్ (గ్రోత్ అండ్ పయనీరింగ్ అహెడ్) ఇటీవల ఎస్టీపీఐ ద్వారా టై దిల్లీ-ఎన్సీఆర్ సహకారంతో, ప్రతిష్టాత్మకమైన ఇన్వెస్టర్ల సమూహంచే ప్రారంభించబడిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ %డ% ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, ఐఏఎస్ అధికారి భువనేష్ కుమార్ హాజరై ప్రసంగించారు. ఎస్టీపీఐ హైదరాబాద్ డైరెక్టర్ సీవీడీ రాంప్రసాద్, ఖ హబ్ సీఈఓ %డ% టై వైజాగ్ ప్రెసిడెంట్ రవి ఈశ్వరపు, ఎస్టీపీఐ డైరెక్టర్ సుబోధ్ సచన్ %డ% ఎఫ్ట్రానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, ఎన్టైఐఎస్ విజయవాడ చీఫ్ మెంటార్ దాసరి రామకృష్ణ ప్రసంగించారు. డే ఆఫ్ ఇన్నోవేషన్ కు వేదికను ఏర్పాటు చేసేలా, రాష్ట్రంలో స్టార్టప్‌ల పెంపకం కోసం ఎస్టీపీఐ %డ% టై ఎలా పని చేస్తు న్నాయి అనే దాని గురించి వారు తమ దృక్పథాలను పంచుకున్నారన్నారు.మరిన్ని వివరాల కోసం, డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ.ఎస్ టి పి ఐ. ఇన్ ని సందర్శించాలన్నారు.

గృహ రుణ గ్రహీతలకు ఎస్‌బిఐ రిన్ రక్షా సురక్షితం

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అర్ ఏ సి పీ సి -1, విజయవాడ లో గురువారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో రిన్ రక్షా పథకం యొక్క వివరాలను తెలియచేసారు. అంతేకాక ఇంటి కోసం రుణం తీసుకున్న హసీనా బేగం చనిపోవటం, ఆమె స్టేట్ బ్యాంక్ వారి రిన్ రక్షా పథకంలో చేరి ఉండటం వలన ఆమె చెల్లించవలసిన మొత్తం రుణం రూ.47.00 లక్షలు రద్దు చేయటమైనదని తెలియచేసారు.. అందుకు సంబంధించిన చెక్కును స్టేట్ బ్యాంక్ జనరల్ మేనేజర్ ఎన్డబ్ల్యూ-%××%, ఓం నారాయణ శర్మ అందచేసి రుణ పరిష్కారం చేసారు. ఈ సందర్భంగా మనీష్ కుమార్ సింగ్, డీజీఎం (బి అండ్ ఓ) విజయవాడ మాట్లాడుతూ గృహ నిర్మాణ రుణం పొందే ప్రతి రుణగ్రహీత స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి రిన్ రక్షా ద్వారా రక్షణ పొందవచ్చును అన్నారు. ఒకవేళ రుణం తీసుకున్న వ్యక్తి మరణిస్తే రిన్ రక్షా క్లెయిమ్ ద్వారా అతను చెల్లించాల్సిన మిగతా రుణ మొత్తం రద్దు చేయబడుతుంది అన్నారు. గృహ రుణాల తీసుకునే వారి కొరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు చేపట్టిన ఈ రిన్ రక్షా పథకం చాల ప్రయోజనకారి అని ఈ సందర్భంగా పలువురు లబ్దిదారులు ప్రశంసించారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు అంబిటస్ విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: గుణదల ఇన్నర్ రింగ్ రోడ్ లో గల అంబిటస్ వరల్డ్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల వైస్ ప్రిన్సిపల్ లీనా సాతులూరి

గురువారం తెలిపారు . వీరు గన్నవరం మల్లికార్జున పాఠశాలలో నిర్వహించిన జిల్లా ఫెన్సింగ్ జట్ల ఎంపికలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి డిసెంబర్ 8, 9, 10 తేదీలలో విజయనగరం జిల్లాలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఇండోర్ స్టేడియంలో జరగబోయే రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా లీనా సాతులూరి మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యతోపాటు క్రీడలకు కూడా అత్యున్నత ప్రాధాన్యతమిస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి క్రీడలను తమ జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా వీరికి శిక్షణ ఇచ్చినటువంటి వ్యాయామ ఉపాధ్యాయులు విజయ్ కుమార్ గోగులమూడిని ని పాఠశాల యాజమాన్యం దుప్పలపూడి వంశీ మానస, ఉపాధ్యాయ బృందం ఎంతగానో అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ కోఆర్డినేటర్ కార్తీక్ యడవల్లి, ఉపాధ్యాయులు గద్దం కాంతి పాల్గొన్నారు.

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో టొయోటా కిర్లోస్కర్ మోటర్ కస్టమర్ మద్దతు చర్యలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): తమ కస్టమర్ సెంట్రిక్ విధానానికి అనుగుణంగా, టొయోటా కిర్లోస్కర్ మోటర్, చెన్నై, ఆంధ్రప్రదేశ్‌లోని తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో (నెల్లూరు, తిరుపతి, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి , కాకినాడ, గుంటూరు) ప్రభావితమైన వినియోగదారుల కోసం ప్రత్యేక సహాయక చర్యలను ప్రారంభించింది. టీకేఎం దాని డీలర్ భాగస్వాములతో కలిసి ప్రత్యేక అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్‌లను ఏర్పాటు చేసింది మరియు అవసరమైన కస్టమర్‌లకు తక్షణ సహాయం అందించడానికి ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసింది. అదనంగా, టొయోటా సుషో ఇన్సూరెన్స్ బ్రోకర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వరద పరిస్థితులలో తమ వాహన నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మార్గదర్శకాలకు సంబంధించి వినియోగదారులకు అవసరమైన సమాచారాన్ని తెలియజేయడంలో చురుకుగా పాల్గొంటోంది.

మాన్షన్ హౌస్ ఫ్లాండీ 'వెల్కమ్ ది నౌ' ప్రచారం ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ప్రపంచ బ్రాందీ దినోత్సవం యొక్క నిజమైన స్ఫూర్తిని ఆలింగనం చేసుకుంటూ, మాన్షన్ హౌస్ ఫ్లాండీ తన బ్రాండ్ ప్రతిపాదనను 'వెల్‌కమ్ ది నౌ' పేరుతో డిజిటల్‌లో ఒక అద్భుతమైన మ్యూజిక్ వీడియో ప్రచారం ద్వారా ప్రారంభించింది. ఇది దాని తాజా సమర్పణలో విలక్షణమైన, పెనుమార్పులు తీసుకువచ్చే రుచుల వేడుకగా నిలుస్తుంది. ప్రఖ్యాత సంగీత దర్శకుడు యశ్వంత్ నాగ్ రూపొందించిన ఈ గీతంలో వేదాల హేమచంద్ర, దామిని భాటియా శక్తివంతమైన గాత్రాన్ని అందించగా , 'మోడరన్ లవ్ హైదరాబాద్'లో తన పాత్రకు ప్రసిద్ధి చెందిన సుపర్ణ వోంటైర్‌తో కలిసి మెప్పించారు. ఈ టెంపోను మరింత ఆకర్షణీయంగా మారుస్తూ, ఈ పాట హైదరాబాద్ హిప్-హాప్ రంగానికి చెందిన ప్రముఖులైన అసుర, నవాబ్ గ్యాంగ్‌లచే యానిమేటెడ్ ర్యాప్ విభాగాన్ని కలిగి ఉంది. చురుకైన సంగీత కంపోజిషన్‌కు అనుబంధంగా ప్రఖ్యాత దర్శకులు దిబ్యా ఛటర్జీ దర్శకత్వం వహించిన 3.18 నిమిషాల సంగీత వీడియోగా ఇది రూపుదిద్దుకుంది.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి

విశాలాంధ్ర-కంచికచర్ల: విజయవాడలోని సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ టెక్నాలజీ (సిఐపిఈటి), భారత్ ప్రభుత్వం వారు ఓ బీసీ, ఈ డబ్ల్యూ ఎస్ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి కార్యక్రమాన్ని అందిస్తున్నట్లు జాయింట్ డైరెక్టర్ అండ్ హెడ్ డాక్టర్ సిహెచ్. శేఖర్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ వెనుకబడిన తరగతుల ఆర్థిక అభివృద్ధి సంస్థ వారి సౌజన్యంతో పదో తరగతి ఉత్తీర్ణత కలిగి, 18 నుండి 35 సంవత్సరాలు వయస్సు కల నిరుద్యోగ యువతకు పాలిమర్స్ టెక్నాలజీ నందు మిషన్ ఆపరేటర్ అసిస్టెంట్ - ప్లాస్టిక్ ప్రాసెసింగ్ కోర్సులలో మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ పూర్తి అయిన అభ్యర్థులకు సర్టిఫికెట్స్ తో పాటు హైదరాబాద్, బెంగళూరు, హొసూర్, అనంతపురం, చెన్నై ప్రాంతాలలో ప్రముఖ ప్లాస్టిక్స్, అనుబంధ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు డాక్టర్ శేఖర్ తెలిపారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత భోజన వసతి సదుపాయాలు, ట్రైనింగ్ కిట్, యూనిఫామ్, సేఫ్టీ షూస్ ను సిఐపిఈటి అందిస్తుందన్నారు. అభ్యర్థులు తమ యొక్క విద్యార్హత, కులము, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్ కార్డ్, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో సిఐపిఈటి ప్రతినిధి సాకిరి రామకృష్ణను 9398535697లో సంప్రదించి దరఖాస్తుల ప్రక్రియను పూర్తి చేసుకోవాలని డాక్టర్ శేఖర్ తెలిపారు.

హితేష్ డెంటల్, ఇంప్లాంట్ సెంటర్‌ను ప్రారంభించిన కలెక్టర్

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : స్థానిక కృష్ణలంక భ్రమరాంబపురంలో హితేష్ డెంటల్, ఇంప్లాంట్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు గురువారం ప్రారంభించారు. జిల్లా ప్రజలకు నాణ్యమైన డెంటల్ ఆరోగ్య సేవలను అందించే లక్ష్యంతో డెంటల్ ఇంప్లాంట్ సెంటర్ ను ఏర్పాటు చేసిన డాక్టర్ కోసనం సాయి హితేష్‌ను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి నేపథ్యంలో డెంటల్ ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం ఏర్పడిన తరుణంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, ఉపకరణాలతో దంత ఆరోగ్య సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కేంద్రం ద్వారా నగర ప్రజలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన సేవలు అందించి మంచి గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు. సామాజిక సేవా దృక్పథంతో పేదలకు రాయితీ కల్పిస్తూ సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, మొహమ్మద్ ఇక్బాల్, కృష్ణారావు, డా.కోసనం హి పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో క్రైస్తవులకు మేలు : ప్రవీణ్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రంలో క్రైస్తవులు సిఎం జగన్ మోహన్ రెడ్డి పాలనలో సుఖఃసంతోషాలతో ఉన్నారని ఆంధ్రప్రదేశ్ స్టేట్ బిషప్స్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ వెల్లడించారు . గురువారం ఐలాపురం హెటల్‌లో జరిగిన సమవేశం అనంతరం అయన విలేకరులతో మాట్లడుతూ ఎంతో మంది పాలకుల ఏలికల్లో రాష్ట్రంలోని క్రైస్తవులకు కేవలం ఓట్ల సమయంలొ హామీలిచ్చి అమలు చేయలేదని, వైసిపి ప్రభుత్వంలో సిఎం జగన్ ఇచ్చిన హామీలను కచ్చితంగా ఆమలు చేసి క్రైస్తవుల మనసులో సుస్థిర స్థానాన్ని సంపాదించారన్నారు. గతంతో చంద్రబాబు సిఎం అవ్వడానికి తోడ్పటు నిచ్చిన క్రైస్తవులు , అయన అధికారం కోల్పోగానే అవసరం లెకుండా పోయారని అయన మతి భమించి రాష్ట్రంలో మతమార్పిడిపై అనుచిత వ్యాఖ్యలు చేసారన్నారు. ఆరోజు తోనే క్రైస్తవులు అయనకు దూరమయ్యారని పెర్కొన్నారు. ప్రస్తుత పాలకుడు జగన్ మోహన్ రెడ్డి క్రైస్తవులను అక్కున చేర్చుకుని బాగోగుల బాధ్యత తీసుకుని జాతి అభివృద్ధికి నిత్యం కృషి కొనసాగిస్తున్నారన్నారు .క్రైస్తవుల కు ఇచ్చిన ప్రతిమాటను అయన నిలబెట్టుకున్నారన్నారు.పాస్టర్‌లకు గౌరవ వేతనం,దళిత క్రైస్తవులకు స్మశాన స్థలాలు కోసం జీవో ఇవ్వటం వంటివి అమలు చేశారన్నారు.అలాగే చర్చిల నిర్మాణాలు కోసం అనుమతుల మంజూరుల్లో ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.భవిషత్తులో కూడ అయన పట్ల విశ్వాసం గుర్తించిన క్రైస్తవులు ఆయనకే పట్టం కట్టడానికి సిద్దంగా ఉన్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మేదర సురేష్,తదితరులు పాల్గొన్నారు.

ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌లో అడ్వాన్స్డ్ ఎపిలెప్సీ కేర్ సెంటర్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ ఎడ్యుకేషన్: ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ నందు అడ్వాన్స్డ్ ఎపిలెప్సీ కేర్ సెంటర్ ప్రారంభించినట్లు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్.పోతినేని రమేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ హాస్పటల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం లోనే మొదటి సారిగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ నందు పూర్తి స్థాయి అడ్వాన్స్డ్ ఎపిలెప్సీ కేర్ సెంటర్ ను సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణులు మరియు అధునాతన వైద్య పరికరాలతో ఏర్పాటు చేసామన్నారు. ఆస్టర్ గ్లోబల్ న్యూరో సైన్సెస్ డైరెక్టర్,ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్.రవి గోపాల్ వర్మ, ఆస్టర్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎపిలెప్సి స్పెషలిస్ట్ డాక్టర్.కేని రవీష్ రాజీవ్, ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఎపిలెప్సీ స్పెషలిస్ట్ డాక్టర్.హరిణి ఆధ్వర్యంలో వైద్య చికిత్సలు శస్త్ర చికిత్సలు అందుబాటులోనికి ఈ ప్రాంతంలో తీసుకుని వచ్చామని తెలియచేశారు.ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పావులూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆధునిక పరికరాలు, ప్రత్యేక వైద్య నిపుణులతో ఏర్పాటు చేసిన ఈ వైద్య విభాగాన్ని ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పి.దుర్గా ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారని తెలియ చేసారు.ఈ పత్రికా సమావేశంలో సీనియర్ న్యూరాలజిస్టులు మేజర్ జనరల్ రిటైర్డ్ డాక్టర్ కుమారవేలు, డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ లక్ష్మీ అనూష, డాక్టర్ నిశ్చల్ రెడ్డి, డాక్టర్ ప్రశాంత్ బాబు న్యూరో సర్జన్లు డాక్టర్ అరుణ్, డాక్టర్ ధీరజ్ మరియు బిజినెస్ డెవలప్మెంట్ హెడ్ డాక్టర్ కార్తీక్ చౌదరి పాల్గొన్నారు.

రైతులకు అధికారుల సూచనలు

విశాలాంధ్ర- కంచికచర్ల: ఉద్యానవన శాఖ అధికారి నీలిమ గురువారం గండేపల్లి వేములపల్లి ఎస్ అమరవరం పరిసర ప్రాంతాలలోని పంట పొలాలను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. పైరుకు నష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు పొలంలో నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు పంపాలి,వర్షాలు ఆగిన వెంటనే 19: 19: 19 లేదా13:0:45 లేదా యూరియా వంటి పోషకాలను పంటపై పిచికారి చేయాలి,వర్షాలు తగ్గిన వెంటనే అంతర సేద్యం చేసి కలుపును తొలగించడమే కాకుండా నేల త్వరగా ఆరేటట్టు చూసుకోవాలి,పొలంలో నీరు నిలబడటం వలన ఎండు తెగులు ఆశించే అవకాశం ఉంది. కనుక కాపర్ ఆక్సైడ్ క్లోరైడ్ 3.0 గ్రాములు ఒక లీటరు నీటిలో, లేదా మెటలాక్ సిల్ ం మాంకో జెట్ 2.0 గ్రాములు మొక్కల మొదలు లో పోయాలి,రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గడం వలన ఆకు మచ్చ తెగులు, బూజు తెగులు ఆశించే అవకాశం ఉంది. ఆకుమచ్చ తెగులు నివారణకు కార్బెండైజిమ్ ఒక గ్రాము లేదా మాన్కోజ్ రెండు గ్రాములు ఒక లీటర్ నీటి తో పిచికారి చేయాలి. బూజు తెగులు నివారణకు డైమితో మర్ఫ్ ఒక గ్రాము లీటరు నేటితో లేదా మెటల్ ఆక్సిల్ం మాన్కోజ్ రెండు గ్రాములు లీటరుకు పిచికారి చేయాలి. బ్యాక్టీరియా ఆకు మచ్చ కాన్పారా వంటి తెగుళ్ళ ఆశించే అవకాశం ఉంది. కాబట్టి ముందు జాగ్రత్త చర్యగా పది లీటర్ల నీటికి 30 గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్ మరియు ఒక గ్రాము స్ట్రిప్టో సైక్లిన్ కలిపి ద్రావణం చేసి వీటి వ్యాప్తిని అరికట్టాలి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మార్గదర్శకాలకనుగుణంగా కొత్త ఓటర్ల నమోదు

నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకనుగుణంగా కొత్త ఓటర్ల నమోదు చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్, సెంట్రల్ నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. స్థానిక వీఎంసీ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో పొలిటికల్ పార్టీ ప్రతినిధులుతో గురువారం రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా నుండి తొలగించిన, మార్చబడిన, డబుల్, డెత్ ఓటర్ల జాబితా రాజకీయ పార్టీ ప్రతినిధులకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 2, 3 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో స్వీకరించిన ఫారం-6, 7, 8లపై నివేదికను రాజకీయ పార్టీలకు అందజేయాలని, డిసెంబర్ 8, 9 తేదీల్లో ఉదయం, సాయంత్రం కొత్తగా నిర్మించిన అపార్ట్‌మెంట్లు, విల్లాలు, గ్రూప్ హౌస్‌లలో ప్రత్యేక బృందాలతో డోర్ టు డోర్ సర్వే నిర్వహించి, ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలను అనుసరించి కొత్త ఓటర్ల నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు సాంబశివరావు(టీడీపీ), సుందర్‌పాల్ (వైసీపీ), వినోద్ కుమార్ (బీఎస్పీ), సిటీ ప్లానర్ ప్రసాద్, జెడ్‌సీ-2 మల్యాద్రి, తాహసీల్దార్‌లు వెన్నెల శ్రీను, మాధురి, ఎస్ఇ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన

విశాలాంధ్ర-హనుమాన్ జంక్షన్ : రాష్ట్రంలో ఉన్న అన్ని వైద్య కళాశాలల్లో మూడు వేలమంది నర్సింగ్ విద్యార్థినులకు కార్డియో పల్మనరీ రీసచిటేషన్ (సీపీఆర్) శిక్షణ ఇచ్చినట్లు మత్తు వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి తారక ప్రసాద్ చెప్పారు. రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలల్లో ఎనస్తీషియా ప్రొఫెసర్ నర్సింగ్ విద్యార్థులకు సీపీఆర్ విధానాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ వారు సర్టిఫికెట్స్ అందజేసినట్లు ఉప్పులేటి చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరు సీపీఆర్ పై అవగాహన ఎంతో అవసరం అని అత్యవసర సమయంలో సీపీఆర్ ద్వారా ప్రాణాలు కాపాడవచ్చని చెప్పారు. . ఈ కార్యక్రమాన్ని ఐ ఆర్ సి ఎఫ్ చైర్మన్ డాక్టర్ చక్రారావ్, డాక్టర్ సూరిసెట్టి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

ఓటర్ల నమోదులోజాగ్రత్తలు తీసుకోవాలి

విశాలాంధ్ర-కూచిపూడి : కొత్త ఓటు నమోదు మరొక రెండు రోజులు మాత్రమే ఈనెల తొమ్మిదవ తారీకు వరకు ఉందని, నమోదులో ఏ విధమైన వివాదాలకు తావివ్వకుండా పోలింగ్ కేంద్ర అధికారులు జాగ్రత్తలు వహించాలని మండల తహసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్ సూచించారు. మొవ్వమండల తాసిల్దార్ కార్యాలయంలో గురువారం సాయంత్రంరెండు గంటల పాటు నిర్వహించిన 54 కేంద్రాల బిఎల్వోల సమావేశంలో పలు సూచనలు ఇచ్చారు. ఓటర్ల లిస్టులో డబల్ ఎంట్రీలు ఉన్నా ఫోటోలలో తేడా ఉన్నా, ఓటరుపేర్లలో తేడాలు వచ్చినా, వయస్సు, తండ్రి, భర్త పేర్లలో తేడాలు వచ్చినా తగిన ఆధారాలు(ఆధార్ కార్డు)తో పరిశీలించి సరిచేయాలనిఆదేశించారు. ఓటర్ల చేర్పులు, తొలగింపులలోగాని మార్పులలో గాని రాజకీయ పార్టీల నుంచి ఏ విధమైన ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సూచించారు.